www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231




విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 30 | 02-05-2022 | పుటలు : 4


రంజాన్ పండుగను ఈదుల్ ఫిత్ర్ అంటారు. ఇది పేదల హక్కుగా ప్రవక్త నిర్ణయించారు. స్తోమతగల ప్రతి ఒక్కరూ దానం చేయాలంటారు ప్రవక్త. రంజాన్ ముస్లింలకు సంతోషకరమైన శుభదినం.
రంజాన్ శుభాకాంక్షలు!!

- నన్నయ వాణి



విశ్వవిద్యాలయంలో మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం జరగడం చాలా సంతోషదాయకం. విశ్వవిద్యాలయంలో ఉన్న 4 కళాశాలల నుండి 4 టీములతో పాటు బయట నాట్య పాఠశాలల నుండి విద్యార్థులు, నాట్యాచార్యులు పాల్గొని విశ్వవిద్యాలయ వేదిక మీద కూచిపూడి, భరతనాట్యం, గిరిజన నృత్యం, జానపద నృత్యం, లంబాడీ, పాశ్చాత్య,కోలాటం,పేరిణి శివతాండవం,జుగల్బంది వంటి విభిన్న నృత్య రీతుల్ని ఒకే వేదికపై 100 మంది విద్యార్థులు,కళాకారులు ప్రదర్శించే అవకాశం కలిగింది. ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారి సహకారం,ప్రోత్సాహం విశేషమైంది. ఆర్థిక సహకారం అందించిన ప్రముఖ సంస్థలకు కృతజ్ఞతలు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని, సృజనాత్మకశక్తిని పెంపొందించి ఉత్సాహంగా ఉండటానికి సహకరిస్తాయి. ఉద్యోగులకు పని ఒత్తిడి నుంచి విరామాన్ని కలిగిస్తాయి.

**శ్రీమతి కడలి శ్రీరాజరాజేశ్వరి దేవి**
ప్రోగ్రాం కన్వీనర్, సహాయాచార్య,
విద్యాకళాశాల,అనూర్.

# భారతీయ సంస్కృతిలో.. నృత్యం గొప్ప కళ





## నన్నయలో కన్నుల పండుగగా అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకలు




**30.04.22 (మీడియాసెల్)** భారతీయ సంస్కృతిలో నృత్యం గొప్ప కళ అని, నృత్య కళను భావితరాలకు అందించేందుకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా నృత్య సంబంధిత కోర్సులను త్వరలో అందిస్తామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతీయ నాట్యం ఆర్ష సంప్రదాయ సంస్కృతి సంపన్నమని, ఒంటికి వ్యాయమమని, ప్రేక్షకులకి, సామాజికులకి ఆనందాల హరివిల్లని, సంపూర్ణ ఆరోగ్యమని అభివర్ణించారు. భారతీయ ఇతిహాసాలలో నృత్య కళ ఎంతో ప్రసిద్ధమైనదని చెప్పారు. భారతీయ సంస్కృతిలో భాగమైన నృత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కళలకు పుట్టినిల్లు అయిన గోదావరి జిల్లాల్లో గోదావరి విశ్వవిద్యాలయంగా పేరొందిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా డాన్స్ కోర్సులను అందరికి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మన సంస్కృతిని మనం కాపాడుకుంటూ భావితరాలకు వాటిని అందించాలని తెలియజేసారు. విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన కన్వీనర్ కె.శ్రీరాజరాజేశ్వరిదేవిని అభినందించి, సహకరించిన బీకే (Beekay) టర్బో టిఎంటి, కంటిపూడి స్టీల్స్ రాజమండ్రి, ఎ.హెచ్.కెరియర్, ఎక్సీటాస్ సంస్థలకు అభినందలు తెలిపారు. తరువాత కూచిపూడి నాట్యగురువు డా.పసుమర్తి శ్రీనివాసశర్మ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించిన ఆచార్య మొక్కా జగన్నాథరావుకు అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవ చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. భారతదేశ నృత్య కళారూపాలను తెలియజేసి, దశావతారాలు వంటి అద్భుత కళలలను ఆయన ప్రదర్శించారు. తరువాత ఇంటర్నేషనల్ డాన్స్ డే సెలబ్రేషన్స్ లో ప్రధానంగా కూచిపూడి, భరతనాట్యం,పేరిణీ శివతాండవం, జానపదం,లంబాడీ, దింసా,దాండియా, వెస్టర్న్, జుగల్బంది వంటి ప్రదర్శనలను వంద మంది కళాకారులు ప్రదర్శించారు. విశ్వవిద్యాలయంతో పాటు గోదావరి ప్రాంత వాసులు ప్రదర్శించిన అద్భుతమైన నృత్య కళా ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్స్ డా.కె.సుబ్బారావు, డా.కె.రమణేశ్వరి, కన్వీనర్ కె.శ్రీరాజరాజేశ్వరిదేవి, బీకే(Beekay) టర్బో టిఎంటి సంస్థ సీనియర్ మేనేజర్ ఎల్.కిరణ్ కుమార్, కంటిపూడి స్టీల్స్ రాజమండ్రి అధినేత చెరుకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొనగా డా.తలారివాసు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.




















## సంపాదకీయం




# నృత్యం

*మన భారతీయ నాట్యం ఆర్ష సంప్రదాయ సంస్కృతీ సంపన్నం. ఒంటికి వ్యాయామం. సంపూర్ణ ఆరోగ్యం. ప్రేక్షకులకి,సామాజికులకి ఆనందాల ఆమెత. ఒక సౌందర్య నిధానం! ఒక అనిర్వచనీయ రసానంద తన్మయత్వం! పారవశ్యం! ఒక ఈస్తటిక్ ఎక్స్పీరియన్స్!! ఆ రసం బ్రహ్మానంద సబ్రహ్మచారిణి!!*

*సృష్టి అంతా ఒక అఖండ చలనం. విశ్వమంతా ఒక నర్తనం. పరమాణు కేంద్రకాన్ని పరివేష్టించి ఎలక్ట్రాన్స్ చేసేదీ నర్తనమే. మానవజాతి అస్తిత్వం ఎంత ప్రాచీనమయిందో నర్తన కళ కూడా అంతే ప్రాచీనమైంది. భారతీయ నాట్యశాస్త్ర కర్త అయిన భరతముని నర్తనానికి నాలుగు ఉపాంగాలు అవసరమన్నారు. ఆంగికం,వాచికం,ఆహార్యం, సాత్త్వికం. శరీర అవయవాల కదలిక వలన కలిగే రస స్ఫురణ ఆంగికం. మాటల ద్వారా స్ఫురింప చేయటం వాచికం. వేషధారణ ఆహార్యం. ముఖం, కన్నుల హావభావాల ప్రదర్శన సాత్త్వికం. ఈ ఉపాంగాలన్నీ నటరాజగు శివుని అంతర్భాగాలు.*

*ఏ చినుకు కురిసినప్పుడో, ఏ మబ్బు ముసిరినప్పుడో ఆదిమానవుడు ఆనందంతో ఓ కేక పెట్టి ఓ చిందువేసి ఉంటాడు. ఆ చిందు లయానుగతమై, లయ జతిగామారి నృత్తమై, నృత్యమై, నాట్యమై, లాస్యమై తాండవమై తరతరాలుగా రసజ్ఞ సమ్మోహనంగా లోకాలకు తన్మయత్వం కలిగిస్తూనే ఉంది.ఆ కేక స్వరమై, రాగమై, వర్ణమై, సంగీతమై, శాస్త్రమై రసానంద సాగరమై రసజ్ఞ లోకాన్ని ముంచెత్తుతోంది.*

*విశ్వాన్ని నాట్యమయంగా, శివ మయంగా చూపించి మానవుణ్ణి విశ్వమానవుణ్ణి చేస్తున్నది. దృష్టి పరిధిని సృష్టి కొసలకు విస్తరించే లోచూపు అనుగ్రహిస్తుంది. నృత్య కళాసరస్వతి సాక్షాత్కారం బ్రహ్మానందానుసంధాయకం అనీ తద్వారా మోక్ష సాధకమనీ భారతీయుల పారమార్థిక దృష్టి.*

*పంచభూతములు ముఖపంచకమై, ఆరు ఋతువులు ఆహార్యములై, ప్రకృతి పార్వతి నీతో నడచిన ఏడు అడుగులే స్వరసప్తకమై... చంద్రకళాధర సహృదయా! సాంద్రకళా పూర్ణోదయ లయ నిలయా!!.. అని శ్రీ వేటూరివారు నాటరాజార్చన చేశారు. భావములో,భంగిమలో,గానములో,గమకములో, ఆంగికమౌ తపమీ గతి సేయగ... కైలాసాన కార్తీకాన శివరూపం, ప్రమిదే లేని ప్రమదాలోక హిమ దీపం!*
*తపమని కిరణం, తామస హరణం, శివుని నయనత్రయ లాస్యం! "జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ!"*

*సత్యమై, నిత్యమై వెలిగే ఈశ్వర తత్వంలో పరమాత్మ తాండవం! అదే జ్ఞానవాహిని అయిన సాగర సంగమం!! ఆయనే నటరాజ స్వామి. నమక చమక సహజం – నట ప్రకృతీ పాదజం! నర్తనమే శివ కవచం – నటరాజ పాద సమరజం!! నాదవినోదము, నాట్య విలాసము పరము సుఖము పదము! అభినయ వేదము సభకనువాదము సలుపు పరము పదము!!*

*తాండవం – ఉద్ధృత నాట్యం, అది ఈశ్వరునిది! లాస్యం – సుకుమారమైన నృత్యం, అది పార్వతీదేవిది!!*
*తండు మహర్షి వలన భరత ముని నేర్చినది తాండవం! చూశారా... ఇదంతా మహర్షుల వ్యవహారం. అందుకే నాట్యం 'తపస్సు' అయింది.*

# పరిశ్రమలతో భాగస్వామ్యం అవసరం



**23.04.22 (మీడియాసెల్)** విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాలు, శిక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా విశ్వవిద్యాలయాలకు పరిశ్రమలతో భాగస్వామ్యం అవసరమని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. సోమవారం యూనివర్సిటీ ఈసీ హాల్ లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ, ఇన్ఫోలోబ్(INFOLOB) సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఇంట్రాక్షన్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, ఇన్ఫోలోబ్ ఎం.డి సత్యేంద్ర పసర్లపూడి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యాభ్యాస అనంతరం ఆయా సంస్థలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణలు తీసుకొని, అన్ని అర్హతలు సాధించి, ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తూ కాలాన్ని వృధా చేయకుండా విద్యాభ్యాసం పూర్తయిన వెంటనే ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. విద్యార్థుల ఉన్నతిని దృష్టిలో పెట్టుకొని దానికి కావల్సిన అనుకూల వాతావరణాన్ని విశ్వవిద్యాలయాలల్లో కల్పించడం మన బాధ్యత అని గుర్తుచేసారు.
విశ్వవిద్యాలయాల్లో ఆయా సంస్థల భాగస్వామ్యం ఉండడం ద్వారా విద్యార్థులకు విశ్వవిద్యాలయం అందించే విద్యతో పాటు, ఆయా సంస్థల శిక్షణ కూడా ఒకేసారి అందుతుందన్నారు. తద్వారా విద్యాభ్యాస అనంతరం శిక్షణ పొందిన సంబంధిత సంస్థలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ క్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వారికి ఇన్ఫోలోబ్(INFOLOB) సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా శిక్షణ, ఇన్టెర్న్షిప్, సర్టిఫికెట్లు మరియు ఉద్యోగ అవకాశాలు లభించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ఇన్ఫోలోబ(INFOLOB) సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి పూర్తి సహాయ సహకారాలు విశ్వవిద్యాలయానికి అవసరమని వీసీ కోరారు. దీనిపై ఇన్ఫోలోబ్ ఎం.డి సత్యేంద్ర పసర్లపూడి మాట్లాడుతూ దేశ విదేశాలలో గోదావరి రిజన్ వారికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఈ ప్రాంతం నుండి వెళ్లి ఆయా సంస్థలలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారిని గురించి ప్రస్తావించారు. స్థానిక విద్యార్థులకు ఉన్న విజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. వీసీ జగన్నాథరావు సూచన మేరకు ఇన్ఫోలోబ్(INFOLOB) సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ విశ్వవిద్యాలయానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనుబంధ కళాశాలల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహ్మ హబీబ్ బాషా మాట్లాడుతూ నిత్యం విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ వీసీ ఆచార్య జగన్నాథరావు వినూత్న ఆలోచనలతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తున్నారని, దానికి ఇన్ఫోలోబ్(INFOLOB) సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకరించాలని కోరారు. తరువాత అతిథులను సన్మానించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య వై.శ్రీనివాసరావు, డా.కె.నూకరత్నం, ఇంజనిరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


---

# నేషనల్ వెయిట్ లిఫ్టింగ్‌లో నన్నయకు రెండు సిల్వర్స్

## వీసీ జగన్నాథరావు అభినందనలు

**24.04.22 (మీడియాసెల్)** ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడాకారులు రెండు సిల్వర్ మెడల్స్ సాధించారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేశారు.
బెంగళూరులో జరిగిన సెకండ్ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల విద్యార్థులు





రెండు సిల్వర్ మెడల్స్ సాధించారని అన్నారు. వెయిట్ లిఫ్టింగ్ మెన్ పోటీలలో విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల కె.ఎ మరియ హెచ్.ఎల్ కాలేజ్ ఏలూరు విద్యార్థి సిహెచ్ వినయ్ కుమార్ సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో రెండో స్థానంలో నిలిచారన్నారు. వెయిట్ లిఫ్టింగ్ ఉమెన్ పోటీలలో వి. ఎస్. లక్ష్మి ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కాకినాడ విద్యార్థి పి.ధాత్రి సిల్వర్ మెడల్ సాధించి రెండో స్థానంలో నిలిచారని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్రీడా ప్రతిభను జాతీయస్థాయిలో చాటిన క్రీడాకారులను వీసీ అభినందించారు. క్రీడాకారులకు విశ్వవిద్యాలయం నుండి తగిన గుర్తింపును, ప్రోత్సాహాన్ని అందజేస్తామన్నారు. క్రీడాకారులతో పాటు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా.బి.రామ్ గోపాల్, డా.డి.వి.రమణ, ఎ.లోహిత పాల్గొన్నారు.

# జల పర్యావరణ వ్యవస్థకు అధిక ప్రాధాన్యం



వినిమయ లెక్చర్ క్లబ్ లో మాట్లాడుతున్న డా.రమణేశ్వరి

## ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి

26.04.22 (మీడియాసెల్) జల పర్యావరణ వ్యవస్థలు ఒకదానికొకటి మరియు వాటి పర్యావరణంపై ఆధారపడిన జీవుల సంఘాలను కలిగి ఉంటాయని, జల పర్యావరణ వ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఉంటుందని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి అన్నారు. గురువారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్లో వినిమయ లెక్చర్ క్లబ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ వినిమయ లెక్చర్ క్లబ్ ద్వారా యూనివర్సిటీలోని ఆయా విభాగాల్లో నిష్ణాతులైన ఆచార్యులు తమ పరిశోధన విశేషాలను ఇతరులతో పంచుకుంటున్నారని అన్నారు. తద్వారా ఒకరి నుండి మరొకరికి విజ్ఞాన వ్యాప్తి జరుగుతుందని, నూతన ఆలోచనలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.కె. రమణేశ్వరి మాట్లాడుతూ 'అక్వాటిక్ ఎకోసిస్టమ్స్ యొక్క ఎకోబయోలాజికల్ స్టడీస్' అనే అంశంపై ఉపన్యసించారు. 2015 సంవత్సరంలో యునైటెడ్ నేషన్స్ వారు 17 సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించారని వాటిలో జల జీవవైవిధ్యం ప్రధానమైనది తెలిపారు. జల పర్యావరణ వ్యవస్థ అనేది భూమి ఆధారిత భూమికి సంబంధించిన పర్యావరణ వ్యవస్థలకు విరుద్ధంగా, నీటి శరీరంలో మరియు దాని చుట్టూ ఉన్న పర్యావరణ వ్యవస్థ అని చెప్పారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో ఆక్వా కల్చర్ కు సంబంధించి ప్రత్యేక ప్రాజెక్టులు విద్యార్థులచే నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే మడ అడవుల పై పరిశోధన చేస్తున్నామని, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలకు అవకాశం దక్కిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# నన్నయ వర్సిటీకి కోరమాండల్ సేవలు అభినందనీయం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యం.ఎస్.ఎన్ క్యాంపస్ మెన్స్ హాస్టల్ కి కాకినాడ కోరమాండల్ ఫెర్టిలైజర్స్ వారు కార్పొరేటర్ రెస్పాన్సిబులిటీ లో భాగంగా అందించే సేవలు అభినందనీయమని వర్సిటీ ఓ.ఎస్.డి ఆచార్య ఎస్. టేకి అన్నారు. కాకినాడ గ్రామీణం తిమ్మాపురంలో గల ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యం.ఎస్.ఎన్ క్యాంపస్ లో నూతనంగా నిర్మించిన మెన్స్ హాస్టలకు సుమారు 5 లక్షలు విలువ గల 60 ఇరన్ బెడ్స్ అందించిన సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కోరమాండల్ ఫెర్టిలైజర్స్ వారు చేసే సామాజిక సేవలో నన్నయ వర్సిటీ భాగస్వామ్యం కలిగి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన క్యాంపస్ ప్రిన్సిపాల్ డా.యం. కమల కుమారి కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్య అతిథి కోరమాండల్ ఇంటర్నేషనల్ మేనేజర్ సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య వైద్య స్వయం ఉపాధి రంగాలలో సంస్థ అందిస్తున్న సేవలను వివరించి , నన్నయ వర్సిటీ అభివృద్ధిలో భాగమవ్వడం సంతోషించదగినదన్నారు . భవిష్యత్తులో వర్సిటీ సహకారంతో మరిన్ని సామాజికాభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని హామినిచ్చారు . ఈ సభలో కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు యం.పోచయ్య , పద్మనాభం , వంశీకృష్ణ , చంద్రమౌళి , చీఫ్ వార్డెన్ వార్డెన్ డా. గోపి, విభాగాధిపతులు , బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు .




# ఆక్వాకల్చర్ డిపార్ట్మెంట్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్

26.04.22 (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లో కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ , డిపార్ట్ మెంట్ ఆఫ్ ఆక్వాకల్చర్ విభాగం నందు గురువారం అవంతి ఫీడ్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు . క్యాంపస్ ప్లేస్ మెంట్ నిర్వహించేందుకుగానూ ఫీడ్ కంపెనీ నుంచి టెక్నికల్ డివిజన్ విభాగం నుంచి రంగబాబు, ఏరియా మేనేజర్ సాంబశివయ్య పాల్గొన్నారు. ప్రిన్సిపల్ మరియు ఆకాకల్చర్ విభాగాధిపతి డా.కె. రమణేశ్వరి మాట్లాడుతూ అవంతి కంపెనీ ప్రతి సంవత్సరం ఆక్రాకల్చర్ డిపార్ట్ మెంట్ నందు ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తూ విద్యార్థులను కంపెనీ ఉద్యోగులుగా తీసుకుంటూ వారికి 6 నెలల పాటు శిక్షణ ఇస్తూ తరువాత వారికి విధులు అప్పగిస్తున్నారని ఆక్వాకల్చర్ విభాగం నందు మంచి అవకాశాలు ఉన్నాయని తెలియ చేశారు. ఆక్రాకల్చర్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె. శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆక్వాకల్చర్ విభాగ విద్యార్థులు అందరూ క్యాంపస్ సెలక్షన్స్ సాధించటం ఆనందంగా ఉందని అన్నారు



## మంచి మాట



మీ వెనుక మీ గురించి చెడుగా మాట్లాడేవారిని గురించి ఆలోచించవద్దు. ఎందుకంటే వారి స్థానమెప్పుడూ మీ వెనుకే ఉంటుంది.

## శ్రీశ్రీ జయంతి

(ఏప్రిల్ 30)



శ్రీశ్రీ అంటేనే విప్లవం
ఆయన పేరే ప్రభంజనం
ఆ పేరు చెబితే చాలు
పుడమి తల్లికి పురిటి నొప్పులు స్ఫురిస్తాయి
ఝంఝూనిల షడ్జధ్వానం వినిపిస్తుంది
ప్రపంచమొక పద్మవ్యూహమౌతుంది
కవిత్వమొక తీరని దాహమౌతుంది
ఆయన కవిత వింటే
పల్లెటూళ్ళో తల్లికేదో
పాడుకలలో పేగు కదులుతుంది
ఆయన స్వర్గాలు కరిగిస్తాడు
స్వప్నాలు పగిలిస్తాడు
రక్తాలు రగిలిస్తాడు
రాజ్యాలు కదిపేస్తాడు
నిప్పులు చిమ్ముకుంటూ
నింగికెగిరిపోతాడు
బూజుపట్టిన భావాలను
నెత్తురు కక్కిస్తూ
నేలకి రాల్చేస్తాడు
శ్మశానాలవంటి నిఘంటువులు దాటేసాడు
వ్యాకరణాల సంకెళ్ళు విడిచేసాడు
ఛందస్సుల సర్ప పరిష్వంగ్వం వదిలేసాడు
శ్రమైకజీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదన్నాడు
ఇతిహాసపు చీకటికోణం
అట్టడుగున పడి కనిపించని
కథలన్నీ కావలన్నాడు
పతితులకోసం భ్రష్టులకోసం
ఆకాశపు దారులంట
అడావిడిగా వెళ్ళిపోయే
జగన్నాథ రథచక్రాలను
భూమార్గం పట్టించాడు
భూకంపం పుట్టించాడు
మరోప్రపంచపు
అగ్నికిరీటపు ధగధగలను
ఎఱ్ఱబావుటా నిగనిగలను
హెూమజ్వాలల భుగభుగలను
మనకోసం భువికి దింపాడు
ఆయన
ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవించాడు
భువన భవనపు బావుటాయై పైకి లేచాడు
ఆయనొక దుర్గం
ఆయనదొక స్వర్గం
అనర్గళం అనితరసాధ్యం
ఆయన మార్గం!
ఆయనకు లాల్ సలామ్!!

చక్రావధానుల రెడ్డప్పధవేజీ.



# లైఫ్ సైన్సెస్ ఫ్రెషర్స్ పార్టీ







**30.04.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలోని డిపార్టమెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ సినియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఘనంగా ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్ పార్టీని ఏర్పాటు చేసారు. శనివారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఫ్రెషర్స్ పార్టీకి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై విద్యార్థులనుద్దేశించి ఉపన్యసించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నూతనంగా పీజీ ప్రవేశాలు పొందిన లైఫ్ సైన్సెస్ లోని జూవాలజీ, అక్వాకల్చర్, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ విద్యార్థులకు స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయంలోని విద్యతో పాటు విజ్ఞానం, లైబ్రరీ, క్రీడా, ఎన్.ఎస్.ఎస్ సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అన్ని వనరులను, వసతులను ఉపయోగించుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాలను నిజం చేస్తూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. సమయాన్ని వృథా చేయకుండా లక్ష్య సాధన వైపు నిరంతరం పయనిస్తుండాలన్నారు. తరువాత విద్యార్థులు తమకు అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తూ విద్యార్థి మిత్రునిగా ఉన్న ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలతో హుషారుగా ఫ్రెషర్స్ పార్టీని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల, డా.డి.కళ్యాణి, డా.డి.శ్రీధర్, డా.ఐ.జె.ఎన్.పద్మావతి, డా.ఎస్.మురళిమోహన్, డా.దేవప్రకాష్, డా.కమలాకర్, పి.రేవతి తదితరులు పాల్గొన్నారు.













# ఉత్సాహంగా ఎకనామిక్స్ ఫ్రెషర్స్ పార్టీ









